క్లుప్తంగా

ఈఓఆర్డీకు పదోన్నతి

శిరివెళ్ల: ఈఓఆర్డీ సాల్మన్‌రాజుకు ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాకు ఆయనను కేటాయించారు. పదోన్నతిపై మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలువురు పోలీసులు బదిలీ అయ్యారు. ఏఎస్‌ఐ వహబ్ ఆళ్లగడ్డ వన్‌టౌన్‌కు బదిలీయయ్యారు. అలాగే మహిళా కానిస్టేబుల్ సౌమ్య నంద్యాల వన్‌టౌన్‌కు, రామమద్దిలేటి గోస్పాడుకు బదిలీ కాగా నంద్యాల ట్రాఫిక్ ఏఎస్‌ఐ నాగేశ్వరరావు, పాణ్యం నుంచి హెడ్‌కానిస్టేబుల్ గురుప్రసా దు, బండిఆత్మకూరు నుంచి హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ స్థానిక స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

అడ్మిషన్లు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీలో 2023–24 ఏడాదికి అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైందని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీలతో పాటు హెచ్‌సీఎంఎల్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియంలో కూడా అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి మార్క్స్ మెమో కాపీతో పాటు వివిధ ధ్రువ పత్రాలు, అడ్మిషన్ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు సెల్ : 9441579305 నంబర్లో సంప్రదించాలని కోరారు.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం

నంద్యాల(అర్బన్): రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి కొనియాడారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చిన్న పిల్లల వైద్యులు సుధాకర్, జీఎం బీఈడీ కళాశాల కరస్పాండెంట్ అమీరుద్దీన్ సహకారంతో సోమవారం స్పందన అర్జీ దారులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జేసీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి, అధికారి రఘురాం, జీఎస్‌ఐసీ ఇండస్ట్రీస్ జిల్లా అధికారి శ్రీనివాస్ యాదవ్, జెడ్పీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎఫ్ఓ రాజునాయక్, ప్యాట్రన్ చేతన్ ఆదిత్య పాల్గొన్నారు.

రుణాలు మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని పది పొదుపు గ్రూపులకు రూ. 55 లక్షలు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు మంజూరయ్యాయని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గురుస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అల్లూరు గ్రామానికి చెందిన 5 గ్రూపులకు, హరివరం, తుడుమలదిన్నె గ్రామాలకు చెందిన రెండు గ్రూపుల చొప్పున, కాకరవాడ గ్రామానికి చెందిన 1 గ్రూపులోని సభ్యులకు ఆయా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరైనట్లు స్పష్టం చేశారు.

జాతీయ రహదారి సర్వే పూర్తి

ఉయ్యాలవాడ: నంద్యాల–జమ్మలమడుగు జాతీయ రహదారికి సంబంధించిన భూముల సర్వే పనులు పూర్తయ్యాయని తహసీల్దార్ రవికుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని రహదారి నిర్మాణం కోసం అల్లూరు, మాయలూరు, నర్సిపల్లె, బోడెమ్మనూరు, పుచ్చకాయలపల్లె గ్రామాల పరిధిలోని 33 ఎకరాలు అవసరం కాగా 12 ఎకరాలు ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు. మిగిలిన 21 ఎకరాల భూమిని రైతులకు సంబంధించిన భూములుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు చెప్పారు.

నలుగురికి రిమాండ్

ఆళ్లగడ్డ: తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన నలుగురు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. వివరాలు.. పట్టణ శివారులోని పీవీఎస్‌ఆర్ గోడౌన్ తమ స్థలంలో నిర్మించారని ఆ స్థలానికి సంబంధించిన డి పట్టా తమ పేరుమీద ఉందని గోడౌన్‌లోకి వెళ్లి అక్కడి సిబ్బందిని బెదిరించడంతో గోడౌన్ యజమాని శివరామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులతో విచారణ చేయగా అవి నకిలీ పట్టా అని రుజువు కావడంతో నకిలీ పట్టా సృష్టించడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన డాలు రత్నమయ్య, కమ్మరి అల్లూరయ్య, ఆచారి, యండ్లపల్లి జ్ఞాన సుందరం, సిద్దంరెడ్డి కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని ఎస్‌ఐ వివరించారు.

బిల్లు మంజూరు చేయండి సార్..

ఉయ్యాలవాడ : మూడేళ్ల క్రితం ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చారు. గృహ నిర్మాణం చేపట్టినా ఇంత వరకు బిల్లు మంజూరు కాలేదని స్థానిక హౌసింగ్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ సుగంధర్ ఎదుట బాధితురాలు సోమవారం వాపోయింది. మండలంలోని కొండుపల్లె గ్రామానికి చెందిన వల్లంపాటి లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చినా హౌసింగ్ అధికారులు గృహ నిర్మాణానికి బిల్లు మంజూరు చేసే విషయంలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 2 లక్షలు అప్పు చేసి నిర్మాణం చేపట్టానని పేర్కొంది. ఈ విషయమై హౌసింగ్ ఏఈ నాగరాజును వివరణ కోరగా వల్లంపాటి లక్ష్మమ్మ ఆధార్ కార్డు నంబర్ ఆళ్లగడ్డ మండలంలోని చిన్నకందుకూరు గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మకు మిస్ ట్యాగింగ్ జరిగిందన్నారు. ప్రస్తుతం ఈమె మృతి చెందింది. బాధితురాలి కుమారుడైన వల్లంపాటి క్రిష్టయ్య పేరు మీద కూడా కింద ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే బిల్లు మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఏఈ స్పష్టం చేశారు.



ఆళ్లగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రం..



చాలమర్రిలోని జగనన్న కాలనీలో నిర్మితమవుతున్న ఇళ్లు



బోడెమ్మనూరులోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం

ఇది పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం. సుమారు 70 సంవత్సరాలుగా 30 పడకలతో పాత భవనంలో ఇరుగు గదుల్లో ఉండటంతో రోగులు అనేక ఇబ్బందులు పడేవారు. జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసుపత్రి ఆధునికీకరణపై ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లి 50 పడకల స్థాయికి పెంచడంతో పాటు మొదటి విడతగా రూ. 3 కోట్లతో కొత్త భవనం నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు.

నాలుగేళ్లలో నవసమాజ నిర్మాణం

- జోడెద్దుల్లా సంక్షేమ, అభివృద్ధి
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వసతుల కల్పనకు రూ.89.526 కోట్లు మంజూరు
- పట్టణంలో రూ.47.89 కోట్లు
- రూ.71.94 కోట్లతో రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టుల నిర్మాణాలు
- కొత్త భవనాలతో కళకళలాడుతున్న పల్లెలు
- నాలుగేళ్లలో నలభై ఏళ్ల అభివృద్ధి

ఆళ్లగడ్డ: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలో నలభై ఏళ్ల అభివృద్ధి సాకారమైంది. రహదారులు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు ఇలా పల్లె ముంగిట కొలువదీర్చి గ్రామాలకు నూతన శోభ సమకూర్చింది.

- నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 81 గ్రామ సచివాలయాలను నిర్మించారు. వీటి కోసం రూ 24.30 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుతం ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే పనులు అవుతున్నాయి.
- నియోజకవర్గంలో రూ.17.65కోట్ల ఖర్చు చేసి 81 రైతు భరోసాకేంద్రాల నిర్మాణాలను పూర్తి చేశారు.
- గ్రామీణ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో భాగంగా ప్రతి 2500 మంది జనాభాకు ఒకటి చొప్పున వీటిని ఏర్పాటు చేశారు. 90 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నారు. గ్రామ స్థాయిలో వైద్యసేవలందించేందుకు 30 భవనాలు నిర్మించారు. వీటికి రూ 5.25 కోట్లు వెచ్చించారు.



ఆళ్లగడ్డ - కోవెలకుంట్ల రోడ్డు



రూ.3కోట్లతో నిర్మించిన జనేపల్లె రోడ్డు

- నియోజకవర్గంలో రూ 4.80 కోట్లు ఖర్చు చేసి 30 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల బిల్డింగ్ నిర్మాణ పనులు చేపట్టారు.
- నియోజకవర్గంలో 138.608 కి.మీ. మేర రోడ్ల నిర్మానాలకు రూ.71.94 కోట్లు ఖర్చు చేశారు.
- 24 డిజిటల్ లైబ్రరీలకు రూ. 387.5లక్షలు ఖర్చు చేస్తున్నారు.
- నియోజకవర్గంలో మొత్తం 38317 మందికి పింఛన్ కానుక అందజేస్తున్నారు.
- ఆరు మండలాల్లో నాడు–నేడు కింద మొత్తం 159 పాఠశాలల్లో రెండో విడత కింద రూ.148కోట్లు కేటాయించింది.

మా ఊరుకు రోడ్డు వేస్తారని అనుకోలేదు



గ్రామం నుంచి బత్తలూరుకు రావాలంటే రోడ్డు లేక పోవడంతో పొలం గట్లపై వెళ్లేవాళ్లం.ప్రతి ఎన్నికల సమయంలో గ్రామానికి రోడ్డు వేయిస్తాము ఓట్లు వేయమనే వారు. ఆ తరువాత పట్టించుకునేవారు కాదు. ఇక గ్రామానికి రోడ్డు రాదని అనేక కుటుంబాలు గ్రామం వదిలి పట్టణాలకు వెళ్లి పోయారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో గ్రామ రూపు రేఖలే మారిపోయాయి. బత్తలూరు నుంచి రూ.1.16 కోట్లు నిధులతో తారు రోడ్డు వేయించారు. ఇన్నాళ్లకు రోడ్డు మార్గం సుగమం కావడంతో చాలా ఆనందంగా ఉంది.

– నరహరినాగేశ్వరరాజు, బృందావనం

త్వరితగతిన పనులు

రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత తగ్గకుండా యుద్ధప్రాతిపదికన సెంట్రల్ క్వాలిటీ మానిటరింగ్ టీం సభ్యుల పర్యవేక్షణలో పనులు చేస్తున్నాం. దశాబ్దాలుగా అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారులకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ప్రణాళికలను రూపొందించుకుని పనులు చేస్తున్నాం. త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో సాగుతున్నాం.

– సుబ్బరాయుడు, ఆర్‌అండ్‌బీ డీఈ

చాలా మంది గ్రామం వదిలి పోయారు



ఇది దొర్నిపాడు మండలం వెంకటేశ్వరనగర్ ఈ గ్రామం ఇక్కడ ఏర్పడి సుమారు 70 సంవత్సరాలు దాక అయింది. అప్పటి నుంచి గ్రామం చుట్టు ఎటువైపు వెళ్లాలన్నా పొలాల రస్తా తప్ప, కనీసం కంకర రోడ్డు కూడా లేదు. ఏటా ఎండా కాలంలో గ్రామస్తులు చందాలు వేసుకుని పొలం గట్లు వెంట మట్టి తోలుకుని రాకపోకలు సాగించేవారు. ఇక వర్షాకాలం ప్రారంభమైతే ఆ రోడ్డు కాస్తా కొట్టుకుపోయి గుంతలమయమయ్యేది. దీంతో అనేక మంది గ్రామం వదిలి పోయారు. పిల్లలను హాస్టళ్లలో ఉంచి చదివించుకునేవారు. చివరకు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాలన్నా సాధ్యం కాని పరిస్థితి.వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో పరిస్థితి మారి పోయింది. దొర్నిపాడు నుంచి రూ.227.00 లక్షలతో 4 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం దొర్నిపాడు నుంచి ఎర్రగుంట్ల జాతీయ రహదారి మీదుగా నంద్యాల వరకు రాకపోకలు సాఫీగా కొనసాగుతున్నాయి.

– సత్యనారాయణ , వెంకటేశ్వర్‌నగర్, దొర్నిపాడు మండలం

జగనన్న పాలనలో పేదల కల సాకారం

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

ఆళ్లగడ్డ: నిరుపేదల కలను సాకారం చేసిన ఏకైక పాలకుడిగా జగనన్న చరిత్రలో నిలిపోనున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కొనియాడారు. సీఎంగా జగనన్న ప్రమాణస్వీకారం చేసి నేటికి 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం పట్టణంలో సుమారు 3 వేల బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పుల్లారెడ్డి వీధిలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభించి కోర్టు మీదుగా 4 రోడ్ల కూడలి వరకు నిర్వహించి, అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ర్యాలీని పాత బస్టాండు వరకు వెళ్లి అక్కడి నుంచి చర్చి మీదుగా 4 రోడ్ల కూడలి చేరింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవితంలో నిరుపేదల సొంతింటి కల నెరవేరదనుకున్నారని, అయితే జగనన్న వచ్చి స్థలంతో పాటు ఇంటిని కట్టించి ఇస్తుండటంతో పేదల గుండెల్లో నిలిచిపోయారన్నారు. పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, నాయకుడు గంగుల విజయసింహారెడ్డి, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్ర రెడ్డి, వీరభద్రుడు, వసీం, అమర్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, గొట్లూరు సుధాకర్ రెడ్డి, కమార్ రెడ్డి, సలాం, కొల్లం పుల్లయ్య, దాబా మనోహర్ రెడ్డి, ముల్లా.ఖాదర్‌బాషా, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పులమాల వేస్తున్న ఎమ్మెల్యే గంగుల

సంక్షేమ వారధులు వలంటీర్లు

ఆళ్లగడ్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించే బాధ్యత వలంటీర్‌లపై ఉందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్లను సన్మానించారు.



వలంటీర్లతో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

సంక్షిప్తం

నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ : స్పందన కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఎన్నిసార్లు నివేదికలు పంపినా వారు గైర్హాజరవుతున్నారని అలాంటి అధికారులపై కలెక్టర్‌కు నివేదికలు పంపుతామని చెప్పారు. ట్రాన్స్‌కో, పశు వైద్యం, మైనర్ ఇరిగేషన్, విద్య, ఆర్‌టీసీ, ఆర్‌అండ్‌బీ, ఉపాధి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పెద్దయమ్మనూరు, మాయలూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు గైర్హాజరయ్యారు.

ఆ పాఠశాలలను సీజ్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): మౌలిక సదుపాయాలు లేని పాఠశాలలను సీజ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి ధనుంజయుడు కోరారు. సోమవారం ఈ మేరకు డీఈఓ అనురాధకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్న పలు ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

దుక్కులకు అనుకూల సమయం

దొర్నిపాడు: ఖరీఫ్ పంటల సాగుకు ముందు వేసవి దుక్కులకు ఇదే అనువైన సమయమని మండల వ్యవసాయాధికారి శ్రీ కృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ ప్రణాళిక వేసవి దుక్కుల ఆవశ్యకతపై గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని చెంచు గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్, సీపీఐ ఎంఎల్ ఆర్ఐ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజు కోరారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హులైన చెంచు గిరిజనులందరికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లు, ఫీజుల దోపిడీపై ఈనెల 31వ తేదీన నిశాంత్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు విద్యార్థి యువజన సంఘాల నాయకులు రాజునాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

రమణమూర్తికి తాటిమాను పురస్కారం

నంద్యాల(వ్యవసాయం): తాటిమాను నారాయణ రెడ్డి 9వ స్మారక సాహితీ పురస్కారాన్ని చిన్నయ్యసూరి సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ వైష్ణవ వెంకటరమణ మూర్తికి అందజేశారు. సోమవారం సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు గెలివి సహదేవుడు అధ్యక్షతన నిర్వహించిన ప్రదానోత్సవంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు రమణమూర్తిని సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. రమణమూర్తి రచించిన ఎస్పీ బాలు తారావలిని అవధాని నాగరాజు సమీక్షించారు.

అన్ని వార్డుల అభివృద్ధికి కృషి

నంద్యాల(సిటీ): పట్టణంలోని 42వార్డులు తనకు సమానమేనని, అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా స్పష్టం చేశారు. పట్టణంలోని స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్‌కు తీర్మానానికి వచ్చిన 14 అంశాలకు గాను 2 మినహా మిగిలిన అంశాలను కౌన్సిల్ ఆమోదం తెలియజేశారు. కౌన్సిలర్లు సభామర్యాదలను పాటించకపోవడంపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కౌన్సిలర్లు సమస్యలపై మాట్లాడేందుకు ఒకేసారి నలుగురు లేయడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా

నలుదిశలా అభివృద్ధి

- వాడ వాడకూ సీసీరోడ్లు, డ్రైన్లు ఏర్పాటు
- పట్టణంలో 5 వేల మంది పేదలకు గృహాలు
- గ్రామ సచివాలయాలతో పాలన మరింత చేరువ
- అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు భేష్

నంద్యాల: ఇంతకు ముందెన్నడూ చూడనంత అభివృద్ధి, సంక్షేమంతో నంద్యాల నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉన్నారు. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పూర్తి కాగా మరికొన్ని వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. నలభై ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో పూర్తి చేసింది. నంద్యాలను జిల్లాగా చేయడమే కాకుండా పట్టణంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, బీటీ రోడ్ల పనులను చేపట్టింది. అంతేగాక గ్రామాల్లో సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భవనాల నిర్మాణం చేపట్టింది. ప్రజలకు సచివాలయాల ద్వారా సత్వర సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వాటిని ఏర్పాటు చేసింది.

- రూ. 157 కోట్లతో అమృత్ పనులు చివరి దశకు చేరుకోగా తాగు నీటి ఇబ్బందులు రాకుండా ఇందుకు అదనంగా మరో రూ.1.05 కోట్లతో డెడికేటెడ్ ఫీడర్‌లైన్, ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి పగటి పూట నీళ్లు ఇచ్చేందుకు మార్గం సుగమం చేశారు.
- పట్టణంలో9 పార్కులను రూ.3.04 కోట్లతో అభివృద్ధి చేశారు.
- చామకాల్వపై 2 బ్రిడ్జిలను నిర్మించారు. వీటి వల్ల ఆయా ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది.
- సరస్వతి నగర్ నుంచి హనీఫ్ నగర్ ప్రాంతాల మధ్యనున్న చామకాల్వపై వంతెన నిర్మాణానికి రూ. 80లక్షలు వెచ్చించారు.సలీం నగర్ నుంచి హనీఫ్ నగర్ ప్రాంతాల మధ్య రూ.90లక్షలతో బ్రిడ్జి నిర్మించారు. పలు ప్రాంతాల్లో వ్యాయామ పరికరాలు, ఆట వస్తువుల ఏర్పాటుకు రూ.కోటి వెచ్చించారు. మొత్తం ఎస్సీసబ్‌ప్లాన్ నిధులు 2016–17 గ్రాంట్స్ నుండి విడుదలైన రూ.2.70 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు.

15వ ఆర్థిక సంఘం నిధులతో..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు చోట్ల సీసీ డ్రైన్లు, పైప్‌లైన్‌లు ఏర్పాటు చేశారు. 2019 నుంచి నేటి వరకు సుమారుగా 27 పనులను గుర్తించగా 11 పూర్తి కాగా 9 పనులు ప్రోగ్రెస్‌లో ఉండగా 7 పనులు ఇంకా మొదలు కాలేదు. 11 ప్రాంతాలలో సీసీ డ్రైన్లు నిర్మించారు, ఇందులోరూ.3.12లక్షల పనులు పూర్తి అయ్యాయి. బరియల్ ప్రహరీ నిర్మాణానికి, పట్టణంలోని లిట్టర్ బిన్స్, బాక్స్ కంపోస్టింగ్ తదితర అభివృద్ధి కోసం వినియోగించే వస్తువులను 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించనున్నారు.

ఎంపీ ల్యాడ్స్ నిధులతో..

- బోర్‌వెల్ డ్రిల్లింగ్ కోసం రూ.1.20, 21వ వార్డులో పైప్‌లైన్ కోసం రూ. 5లక్షలు, సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 10లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు.

పేదలకు పక్కా గృహాలు..

- మొదటి విడతలో 3,006 మందికి పట్టాలు అందించారు. మలి విడతలో మరో 2వేల మందికి లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 10వేల టిడ్కో గృహాలు రూ.685 కోట్లతో నిర్మించారు. ఇందులో 300 చదరపు అడుగుల 8,704 గృహాలు ఉచితంగా పేదలకు అందించేందుకు ఏర్పాట్లు చేయగా మొదటి విడతలో 4వేలకు పైగా అందించారు.
- నంద్యాల మండల పరిధిలో రూ.4.40 కోట్లతో 21 నూతన గ్రామ సచివాలయాలకు గాను 11 గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి.
- రూ.60 లక్షలతో 17 రైతు భరోసా కేంద్రాలకు గాను 3 రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాలు పూర్తి చేశారు.
- 12 వెల్‌నెస్ సెంటర్‌లకు గాను రూ.17.5 లక్షలతో ఒక భవనం, రూ.17 లక్షలతో బల్క్‌మిల్క్ సెంటర్ భవనా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి.
- రూ.4.12 కోట్లతో 20 సీసీ రోడ్లు నిర్మించారు. మరో 16 నూతన సీసీ రోడ్ల ఏర్పాటుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు నివేదిక పంపారు.
- కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల భక్తులు మహానందికి అయ్యలూరు - పెద్దకొట్టాల గ్రామాల మీదుగా వెళ్లే వారు. ఆ రహదారి శిథిలమవడంతో రూ.60 లక్షలతో అభివృద్ధి చేశారు.
- రూ.5.50 కోట్లతో నూతన డ్రైనేజీలను ఏర్పాటు చేసింది.
- మండలంలో మొత్తం 62 ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేశారు. మొదటి విడతలో రూ.5 కోట్లతో 23 పాఠశాలను తీర్చిదిద్దగా.. రెండవ విడతలో మిగిలిన పాఠశాలల అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.
- గోస్పాడు మండలంలో గ్రామాల్లో రూ.40లక్షల ప్రకారం 12 సచివాలయాలకు నూతన భవనాలకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే 8 భవనాలను పూర్తి చేశారు. మిగిలిన భవనాల పనులు నిర్మాణాలు వివిధ దశల్లో జరుగుతున్నాయి. వాటి కోసం రూ.4.55 కోట్లు మంజూరయ్యాయి.
- 8 హెల్త్‌క్లినిక్‌లకు రూ.1.40 కోట్లు మంజూరు చేయగా 5 పూర్తి కాగా మిగిలినవి పనులు జరుగుతున్నాయి.
- 12 ఆర్బీకేల ఏర్పాటుకు రూ.2.61 కోట్లు మంజూరు చేయగా 8 భవనాలు పూర్తయ్యాయి.
- రెండు పాల కేంద్రాల నిర్మాణానికి రూ.35లక్షలు విడుదలయ్యాయి.
- రూ.5 కోట్లతో దీబగుంట్ల నుంచి గాజులపల్లె మెట్ట వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. అలాగే 7 కి.మీ మేర మరమ్మతు పనులు చేపట్టేందుకు రూ.90లక్షలు ఖర్చు చేశారు. మండలంలోని గ్రామాల్లో 28కి.మీ మేర సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.15 కోట్లు వెచ్చించారు.





ప్రియాంకనగర్‌లో నూతనంగా వేసిన సీసీ రోడ్డు , ఆటోనగర్ వద్ద హైవే బ్రిడ్జి కింద నిర్మించిన పార్కు



రూపుదిద్దిన ఎంపీపీ పాఠశాల




మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డెస్కులు

మా గ్రామాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు



రోడ్డు వేయాలని గతంలో అనేక సార్లు నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగినాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినాక గ్రామంలోని ప్రధాన రహదారిని చాలా చక్కగా తయారు చేశారు. వలంటీర్ వ్యవస్థ కూడా చాలా బాగుంది. ఏ సమస్య ఉన్నా ఇంటి వద్దకు వచ్చి అడిగి తెలుసుకుంటున్నారు. సచివాలయం ఏర్పాటుతో మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పింది. గ్రామంలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. –సరళ, పెద్దకొట్టాల గ్రామం

గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి



విత్తనాలు, ఎరువులను పట్టణాలకు వెళ్లి తెచ్చుకొనేవాళ్లం. నేడు ఆ పరిస్థితి లేదు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులతో పాటు వ్యవసాయానికి కావలసిన పనిముట్లు సైతం అందుబాటులో ఉంచారు. వీటి కారణంగా నకిలీ విత్తనాలు, నకిలీ మందుల బెడద తప్పింది. పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు.

– సిద్దయ్య రైతు, సాంబవరం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నంద్యాల(న్యూటౌన్): మిట్నాల గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి, విశ్వేశ్వర, వీరభద్ర ఉమాసమేత నాగలింగేశ్వర, నందీశ్వర, ధ్వజ, బసవేశ్వర అభయాంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర, కుమారస్వామి, సరస్వతి, నవగ్రహ, కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఒంగోలు జాతి వృషభాల పోటీలను నిర్వహించారు. కొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి వృషభాలు మొదటి స్థానం చేరుకొని రూ.40వేలు కైవసం చేసుకున్నాయి. రెం ఛిడబహుమతి ప్రకాశం జిల్లా ఎర్రపాలెం గ్రామానికి చెందిన హేమలత నాయుడు వృషభాలు రూ.30వేలు దక్కించుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కొట్టాల గ్రామానికి చెందిన భవశ్రీ వృషభాలు మూడో స్థానం చేరుకొని రూ.20వేలు, బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచి రూ.10వేలు, కోవెలకుంట్ల చెందిన మదార్‌బాషా వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.5వేలు దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం